

# నీడలు నిజాలు

"శ్రేయోభిలాషి!"

రంగనాథంగారి ముఖం కోపంతో కందగడ్డ అయింది!

"ఎవరీ శ్రేయోభిలాషి?"

ఆయన కళ్లనుంచి ఆవిర్లు తేలసాగాయి.

కొద్ది క్షణాలు బిగుసుకు కూర్చున్నారు

ఆపైన —

మనిషి క్షణక్షణానికి నీరసంలోకి దిగజారిపోసాగారు. కళ్ళు రెపరెపలాడించారు. పెదాలు బిగుపట్టారు. తరవాత పట్టు తప్పుతున్నట్లుగా జారిపోయారు. ముఖమంతా పీక్కుపోయినట్లుగా నల్లబడిపోయింది.

నరనరం కదిలిపోయేలా ఒక గాఢమైన వేడి నిట్టూర్పు ఆయననుండి వెలువడింది.

ఓడిపోయిన మనిషిలా వెనక్కి వాలబడిపోయారు.

'శారదకు ఇక వివాహం కాదు!'

కళ్ళు మూతలు పడిపోయాయి.


'తను శారదకు వివాహం చెయ్యలేడు!'

మరో నిట్టూర్పుతో మనిషి పూర్తిగా నీరసపడిపోయారు.

'తనిప్పు డేం చేయాలి?'

చేతిలోని కాగితాలమీదకు కళ్ళు మరోసారి పరిగెత్తాయి.

పి. ఎస్. నారాయణ



"రంగనాథంగారూ!

క్షమించాలి. నేను మీకు తెలియనప్పటికి, నేను చేయబోయే పని ఓ శుభకార్యాన్ని చెడగొట్టే పాపిష్ఠి లాంటిదైనప్పటికి, చేయక తప్పటంలేదు. దానికి కారణం, మీ వంశం. నిప్పులాంటి మీ వంశోన్నతి!

మీ అమ్మాయికి నిశ్చయించుకోబోతున్న యువకుడు — రామ్మూర్తి — కుటుంబ చరిత్ర అంతగా బాగుండలేదని చెప్పటానికి విచారిస్తున్నాను. అతడి చెల్లెలు మరో కులస్థుడితో లేచిపోయిందన్న సంగతి అందరికీ కాకపోయినా నాలాంటి కొద్దిమందికి తెలుసు! అందువల్ల మరోసారి ఈ సంబంధాన్ని నిశ్చయించుకోబోయేముందు దాని మంచిచెడ్డలు ఆలోచించండి.

ఇందులో — ఇలా వ్రాయటంలో — నాకు వచ్చే లాభం ఏమిటని మీ రడగవచ్చు. నా ఈ ఉన్నతస్థితికి, మీరు చిన్న వయస్సులో ఉండగా, మీ నాన్నగారు చేసిన సహాయమే!

కొన్ని కారణాలవల్ల — అంతేగాదు — వరుడి తండ్రి నాకు దగ్గిర బంధువవడంవల్ల నా పేరు గుప్తంగా ఉంచదలుచుకున్నాను!

ఇట్లు,

— మీ శ్రేయోభిలాషి."

ఆయన కుర్చీలో వెనక్కి జారగిలపడిపోయారు.

* * *

శారద కళ్ళముందు కదిలింది. ఇరవై రెండు సంవత్సరాల శారద జాలిగా కళ్ళముందు మెదిలింది.

'తనేం చేయగలడిప్పుడు?' రంగనాథంగారు కళ్ళు మూసుకొని చేతులతో తల నొక్కుకున్నారు.

'తను ఎప్పటికైనా శారదకు వివాహం చేయగలుగుతాడా?' తిరిగి మరోసారి ఆ ప్రశ్న అతడి నరనరాన్ని ఆవరించింది.

నీరసంగా లేచి నిలబడి లోపలికి అడుగుపెట్టారు.

శారదాంబగారు తడిచేతులను చీరచెంగుకు తుడుచుకుంటూ, "ఏమిటి, ఏదో ఉత్తరం వచ్చినట్టున్నది? వియ్యాలవారా? ఎల్లుండి వస్తున్నారటనా?" అని ఆత్రంగా అడిగింది.

రంగనాథంగారు విసురుగా, విసుగ్గా భార్య ముఖంలోకి చూచారు.

మరుక్షణంలోనే విసిరేస్తున్నట్టుగా చేతిలోని ఉత్తరాన్ని ఆమెమీద పడవేసి, పక్కగదిలోకి వెళ్ళి మంచం వాల్చుకు పడుకొని, కళ్ళకు తువ్వాలు చుట్టుకున్నారు.

ఆమె తన తల్లి చచ్చేటంతవరకు పెట్టుకున్న కళ్ళజోడును హడావిడిగా తగిలించుకొని సావకాశంగా చదువుకున్నది. చదవటం పూర్తిఅయ్యేటప్పటికి దానంతటదే ఓ నిట్టూర్పు వెలువడింది.

"సరి! ఈ సంబంధానికి తిలోదకాలే నన్నమాట! ఖర్మ!. . . ముఖానికి పెళ్ళయ్యే గీత ఉండి చావద్దూ!"

చీరచెంగు పరుచుకొని దానిమీద ఒత్తిగిల్లుతూ, ఓ సారి కళ్ళు ఒత్తుకొని కళ్ళు మూసుకుంది.

కొడుకు శేఖరం కాలేజీనుంచి వచ్చాడు.

షైటు ప్యాంటు, పొట్టి చొక్కా వంకెకు తగిలించి చారల చారల పైజామా తొడుక్కున్నాడు. సబ్బుతో ముఖం కడుక్కున్నాడు. టర్కీటవల్‌తో ముఖం తుడుచుకొని ఒకసారి ఇంటి నలుమూలలా తిరిగాడు.

ఏడుస్తున్న శారదను చూచాడు.

కళ్ళకు గుడ్డ కట్టుకొని పడుకున్న తండ్రిని చూచాడు

తను వచ్చాడని చూచికూడా లేవని తల్లిని చూచాడు.

కోపంగా ఎగురుతూ, "ఏం ఎవరైనా చచ్చిపోయారా? — అంతా అలా ఏడుస్తున్నారు!" అని అరిచాడు.

తల్లి సమాధానమయితే చెప్పలేదుగాని, అతగాడి ప్రశ్నకు కోపం రంయ్యిన దూసుకురాగా ఇంత పిండా కూడు కంచంలో పడేసి తిరిగి వచ్చి పడుకుంది.

శేఖరం శుభ్రంగా భోంచేశాడు.

లేచి చేతులుకడుక్కొని మళ్ళీ ఆ ఇంట్లో ఆ దృశ్యాలన్నిటినీ తాపీగా ఓసారి చూచి, "అసలు ఇంతకీ ఏమయిందమ్మా?" అని అడిగాడు, అసలు విషయం రాబట్టాలనే ఉద్దేశ్యంతో అనునయంగా.

తల్లి ఉత్తరం ఇచ్చింది.

చదివాడు శేఖరం.

సర్వం అర్థమయింది.

ఒక్కసారి బిగ్గరగా నవ్వి, పెదవులు అల్లల్లాడిస్తూ ఈల వేశాడు.

"అయితే ఇప్పుడు వచ్చిన నష్టమేమిటి?" కళ్ళు

> **భయంకరం**
>
> వెయ్యి తుపాకీగుండ్లకంటె భయంకరమైనవి — శత్రుత్వం వహించిన నాలుగు వార్తాపత్రికలు.
>
> —నెపోలియన్

చక్రాలంత చేసుకొని తల్లి ముఖంలోకి చూచాడు.

"మీ నాన్న నడుగు!" ముక్కు చీదేసింది.

తండ్రిదగ్గిరకి ఎగురుకుంటూ వెళ్ళి, వంకరగ నిలబడి సూటిగా చూస్తూ అడిగాడు, "దీనివల్ల నష్టమేమిటి, నాన్నా!" అని.

ఆ గదిలోనే మూలగా, దిగాలుముఖంతో ఏడుస్తున్నట్టుగా కూర్చున్న శారద వింతగా నోరు తెరుచుకొని వాళ్ళిద్దరివంకా చూచింది.

ఆమె గుండె దడదడలాడింది!

"చూస్తూ చూస్తూ ఆ అప్రాచ్యుడికి మనమ్మాయిని ఎలా ఇస్తాంరా?" అన్నారు సగం మంచంమీద లేచి, అసహ్యంగా చూస్తూ రంగనాథంగారు.

"అదెవతో లేచిపోతే వాడికేం వచ్చింది మధ్యలో పుండు!" విసురుగా అడిగాడు శేఖరం.

"అదెవత్తోనా? . . . ఎంత అప్రతిష్ఠ! . . . వాడికా నా పిల్లనిచ్చేది? . . . చస్తే ఇవ్వను . . . అసలు పెళ్ళే కాకపోనీగాక!"

'సరే! మీ ఖర్మ . . . చావండి!' అన్నట్టుగా విసురుగా బయటకు నడుస్తూ జాలిగా ఓసారి శారద ముఖంలోకి చూచి, ఇవతల పడ్డాడు శేఖరం. షైట్ ప్యాంటు ఇరికించుకున్నాడు. బొత్తెడు చొక్కా ఒంటికి తగిలించుకొని, సైకిలెక్కి కాలేజీకి పోయాడు.

రంగనాథంగారూ అతడి వెనకాలే లేచి ఒక కార్డుముక్క తీసుకొని బరబరా (లగ్నాలు పెట్టుకునేందుకు రావద్దని) అవబోతారనుకున్న వియ్యాలవారికి గీకేసి స్వయంగా పోస్టుడబ్బాలో వేసేందుకుగాను, మీద ఉత్తరీయం వేసుకొని ఎండలో కాలు పెట్టాడు.

శారద ఓ నిట్టూర్పు విడిచింది!

* * *

మూడోరోజు అసలు అనుకున్న ప్రకారం రావలిసిన వియ్యాలవారు రావటమైతే మానేశారుగాని తెల్లవారేటప్పటికి శారద పడుకునే మంచంమీద శారదకు బదులుగా శారద వ్రాసిన ఓ ఉత్తరం పడి ఉన్నది.

దాన్ని ముందుగా చూచింది శేఖరం!

దాన్ని ఓసారి చదివేసి, హడావిడిగా తండ్రిదగ్గిరికి పరిగెత్తి ఆయన చేతిలో పెట్టి, ఆయన కళ్ళల్లోకి చూశాడు.

ఆత్రంగా ఆయన దాన్ని చదువుకోసాగారు.

"నాన్నా!

నా ఆనందం మరొకరి దుఃఖానికి — అందునా నాకీ జన్మనిచ్చి, నన్ను పువ్వుల్లో పెట్టి పెంచిన మీ దుఃఖానికి — హేతువవుతున్నప్పటికీ, నేను ఈ పని చేయక తప్పటంలేదు. కారణం, నా లోని స్వార్థం ... నా నరనరాన్ని ఆవరించి ఉన్న నాలోని స్వార్థం!

కాదనలేను, నాన్నా — నా ఈ అన్యాయపు పనితో మిమ్మల్ని వంచించటమే గాకుండా, మిమ్మల్ని నలుగురిలోను తలఎత్తుకు తిరగకుండా చేస్తున్నాను. మీ జీవితాల్ని ఇతరుల పరిహాసపు సంకెళ్ళలో బంధించి మిమ్మల్ని చిత్రహింస చేస్తున్నాను!

ఇదంతా నా ఆనందంకోసరం; నా సౌఖ్యంకోసరం; నేను కన్న కలల్ని నిజం చేసుకోవటంకోసరం; నేను కట్టుకున్న ఊహాహర్మ్యాలను బంగారు కోటలుగా మార్చుకోవటంకోసరం . . . నన్ను నేను స్వర్గలోకంలో ప్రతిష్ఠించుకోవడం కోసరం . . .

అందుకే—ఈ ఉత్తరం మీ కంటబడే సమయానికి నా రాజు, జీవన సారథి కృష్ణతో — ఎన్నోమైళ్ళ దూరానికి వెళ్ళిపోయిఉంటాను!

నేను పాపిని.

నన్ను క్షమించగలరా? . . . క్షమించగలిగితే ధన్యురాలిని!

ఉంటా. . .

మీ పుత్రిక,

—శారద."

"క్షమించాలి. మరొక్క మాట —

నాకు నిశ్చయించబోతున్న సంబంధం గురించి అవాకులుచెవాకులతో మీకు మొన్న వచ్చిన ఉత్తరం వ్రాసింది నేనే! — మా ఆలోచనలు నిజమయ్యేలోగానే లగ్నాలు నిర్ణయించి, తరవాత అభాసవుతారనే భయంతో నేను చేసిన పని అది! నేను ఊహించినట్టుగానే జరిగింది!

కాని ఒక్కఅనుమానం. మీకు బాధకలిగించేదైనా ఈ ప్రపంచంలో అంతా మీలాంటివారే ఉన్నట్టయితే అన్నయ్య పెళ్ళి? . . .

మరోసారి మన్నించమని ప్రార్థిస్తూ,

—శారద." ★